క్లుప్తంగా

తాగి వాహనం నడిపిన ఒకరికి జైలు శిక్ష

జగిత్యాలరూరల్: మద్యం తాగి వాహనం నడిపితే జైలుకెళ్లడం తప్పదని ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం అన్నారు. గొల్లపల్లి మండలం ఇబ్రాజీపల్లికి చెందిన తుమ్మ మధుకర్ ఇటీవల అతిగా మద్యం తాగి పట్టుబడగా.. అతన్ని సోమవారం కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి అతడికి నాలుగు రోజుల జైలుశిక్ష విధించారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి



బతికపల్లిలో ఎడ్యుకేషన్ డే

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను లబ్ధిదారులు వినియోగించుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు రమ, శైలజ కోరారు. బతికపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఎడ్యుకేషన్ డే నిర్వహించారు. ప్రీస్కూల్ విద్య, పౌష్టికాహారం, ఆరోగ్య సలహాలు తదితర అంశాలపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు.

బకాయిలు చెల్లించాలి



వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

మెట్‌పల్లి: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్మికులు కమిషనర్ మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. 11 నెలల క్రితం ప్రతి కార్మికుడికి రూ.వెయ్యి చొప్పున వేతనం పెంచినా.. కేవలం నాలుగు నెలలు మాత్రమే చెల్లించారని వాపోయారు. మిగతా ఏడు నెలలు ఇవ్వాల్సి ఉందని, మే నెల జీతంతోపాటు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధ్యక్షుడు బర్ల లక్ష్మణ్ ఉన్నారు.

మేడే ఉత్సవాలు విజయవంతం చేయాలి



పెగడపల్లిలో మేడే పోస్టర్ ఆవిష్కరణ

పెగడపల్లి: మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం మేడే ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రవీణ్, సురేశ్, రాము, రమేశ్, అంజయ్య, సంజీవ్, రాజయ్య, చంద్రయ్య, లచ్చయ్య, సర్వయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి

మల్లాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఐకేపీ డీపీఎం మల్లేశం అన్నారు. సోమవారం మండలంలోని రాఘవపేట, మొగిలిపేట, ఒబులాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. ఐకేపీ ఏపీఎం దేవరాజ్, సీసీలు రమేశ్, రాజు, వీవోఏలు లావణ్య, రమ్య, కమిటీ నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి నివాళి

మల్లాపూర్: ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శి భారతి చిత్రపటానికి ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రత్నాపూర్ పంచాయతీ కార్యదర్శిగా పని చేసి బదిలీపై మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేటకి వెళ్లిన భారతి గుండెపోటుకు గురై మృతిచెందడం బాధాకరమన్నారు. ఎంపీవో జగదీశ్, సీనియర్ అసిస్టెంట్ మహేశ్, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

కోరుట్ల: పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు జక్కుల జగదీశ్వర్ తండ్రి, జ్యోతిష్య రత్న జక్కుల శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. జగదీశ్వర్ కుటుంబాన్ని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సోమవారం పరామర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, నాయకులున్నారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లిరూరల్: జగ్గాసాగర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఎల్లమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ సాయిరెడ్డి, గీత కార్మిక సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా బీరయ్యస్వామి కల్యాణం

కోరుట్లరూరల్: చిన్నమెట్‌పల్లి గ్రామంలో బీరయ్యస్వామి జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు, బీరయ్యస్వామి కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శేష వస్త్రంతో సత్కరించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సింగిల్‌విండో చైర్మన్ బండి భూమయ్య, ఆలయ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఆధ్యాత్మికం

ఇబ్రహీంపట్నం: వర్షకొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ హోమం, తెప్పోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ దొంతుల శ్యామల, తుక్కారం, ఆలయ అర్చకులు దివాకరచార్యులు, యాజ్ఞాచార్యులు, చక్రపాణిమాధవచార్యులు, ప్రవీణ్‌శర్మ, మోహన్‌శర్మ, అన్వేష్‌చార్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గంగపుత్రులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మల్లాపూర్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. సోమవారం మండలంలోని చిట్టాపూర్‌లో నిర్వహించిన రేణుక ఎల్లమ్మ ఆలయ జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఎంపీగా జీవన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. సీడీసీ మాజీ చైర్మన్ కంది బుచ్చిరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ ఎంచిరాల చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్, నాయకులు కొత్తపల్లి రాజేందర్, బాలసాని ప్రణయ్, లక్ష్మీనారాయణ, మహేందర్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



మల్లాపూర్: మొగిలిపేట శివారులో కోటిలింగేశ్వర ఆలయ అభివృద్ధి కోసం భూక్య భూమానాయక్ సోమవారం రూ.5,116 విరాళంగా అందించారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఎండీ మహబుబ్‌ఖాన్, సభ్యులు భూమానాయక్‌కు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందించి ఘనంగా సన్మానించారు.

పాదయాత్ర



జగిత్యాలరూరల్: కోరిన కోరికలు నెరవేర్చడంతో లక్షెట్‌పేటకు చెందిన మాదంశెట్టి రాంచందర్, మాడ వేణుగోపాల్, రాచర్ల శ్రీనివాస్ సోమవారం లక్షెట్‌పేట నుంచి జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని సహస్ర వెయ్యిలింగాల దేవాలయం వరకు పాదయాత్ర చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. వీరిని ఆలయ వ్యవస్థాపకులు నలమాసు గంగాధర్ ఘనంగా సన్మానించారు.

పోలీసుల అదుపులో సెల్‌ఫోన్ దొంగలు..?

మల్లాపూర్: మద్యం మత్తులో ఓ కిరాణదుకాణదారుడి సెల్‌ఫోన్‌ను దొంగలించిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాలకు చెందిన ఇద్దరు మైనర్లు బైక్‌పై మండలంలోని గొర్రెపల్లికి వచ్చారు. సామల్ల రాజు దుకాణానికి వెళ్లి వాటర్ బాటిల్ అడిగారు. ఆయన ఫ్రిజ్‌వద్దకు వెళ్లగానే అక్కడే చార్జింగ్ పెట్టిన ఫోన్ తీసుకుని మల్లాపూర్ వైపు పరారయ్యారు. రాజు ఇచ్చిన సమాచారంతో అతని స్నేహితులు వారిని అడ్డుకుని పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మైనర్లను తనిఖీ చేయగా.. గంజాయి ప్యాకెట్ కూడా లభించినట్లు సమాచారం.

మొగిలిపేటలో బెల్ట్‌షాప్‌పై పోలీసుల దాడి



సీజ్ చేసిన మద్యం బాటిళ్లు

మల్లాపూర్: మొగిలిపేటలో ఓ బెల్ట్‌షాప్‌పై సోమవారం రాత్రి ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి రూ.6,808 విలువైన మద్యాన్ని పట్టుకున్నారు. బెల్ట్‌షాప్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాల: ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి మధు ఎంపికయ్యారు. ఈనెల 23న కరీంనగర్‌లో జరిగిన హ్యాండ్‌బాల్ ఇంటర్ కాలేజ్ సెలక్షన్ పోటీల్లో మధు ఎంపికయ్యారు. కేరళ రాష్ట్రం కొట్టాయంలో వచ్చేనెల 2 నుంచి 12 వరకు జరుగనున్న ఈ పోటీల్లో మధు పాల్గొనున్నారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అశోక్, వైస్ ప్రిన్సిపల్ కరుణాకర్, ఫిజికల్ డైరెక్టర్ కోరుకంటి రవికుమార్, ఎల్జిబెత్ రాణి అభినందించారు.

నూతన నియామకం

కోరుట్ల: చేనేత పద్మ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన గజెల్లి రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు చేనేత పద్మ సమైక్య రాష్ట్ర అధికార ప్రతినిధి రాపెల్లి బాలరాజ్ నేత నియామక పత్రాన్ని రాజేంద్రప్రసాద్‌కు సోమవారం అందజేశారు.

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డికి నియామక పత్రం అందిస్తున్న గోపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇబ్రహీంపట్నంకు చెందిన బద్దం శ్రీనివాస్‌రెడ్డిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు.

రాయికల్(జగిత్యాలరూరల్): కొత్తపేట గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షుడిగా తునికి రంజిత్‌ను నియమిస్తూ మండల అధ్యక్షుడు అన్నవేని వేణు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి ఆకుల మహేశ్, నాయకులు రంజిత్‌కుమార్, రాజేశ్, నాగరాజు, నరేశ్, రవి పాల్గొన్నారు.

రాయికల్ వర్తక సంఘం అధ్యక్షుడిగా రాయికల్ పట్టణానికి చెందిన ఎలగందుల సత్యనారాయణ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉపకార వేతనాలు సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి: విద్యార్థులు ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలని జ్ఞానోదయ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ పేర్కొన్నారు. కళాశాలకు చెందిన సుమారు 90 మంది విద్యార్థులకు జిందాల్ కంపెనీ నుంచి ఉపకార వేతనాలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను సోమవారం విద్యార్థులకు అందజేశారు. డైరెక్టర్లు వేణుగోపాల్, కమలాకర్‌రావు, ప్రిన్సిపాల్ సంతోష్ తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీడబ్ల్యూడీ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ కొండయ్య అన్నారు. సీనియర్ సిటిజన్స్ వికలాంగుల శాఖ, బాలల సంరక్షణ, చైల్డ్‌లైన్ బృందం ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల మండలం నర్సింగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఉపాధిహామీ కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళ సాధికారతపై అవగాహన కల్పించారు. బాలల సంరక్షణ, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ 1098, ఓటరు హెల్ప్‌లైన్ 1950 అవగాహన కల్పించారు. పంచాయతీ సెక్రటరి సురేశ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ శంకరయ్య, బాలల సంరక్షణ కేంద్రం సోషల్‌వర్కర్ గంగాధర్, చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్ రజిత, మహిళ సాధికారత కేంద్ర బృందం గౌతమి, హేమశ్రీ పాల్గొన్నారు.

గొల్లపల్లిలో పోలీసుల కవాతు



కవాతును ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ భీంరావు

గొల్లపల్లి: అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి నల్లగుట్ట, అంబేడ్కర్ చౌరస్తా వరకు పోలీస్, కేంద్ర సాయుధ బలగాలు కవాతు చేపట్టాయి. అక్రమ మద్యం, నగదు రవాణాపై పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సీఐఎస్ఎఫ్ అధికారులు, సీఐ రాంనర్సింహారెడ్డి, ఆర్ఐ వేణు, ఎస్సై సతీష్, అర్ఎస్సైలు మనీశ్, వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

రెండేళ్లలో ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు

- తుంగూర్ యువకుడి ప్రతిభ



సంజీవ్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన బెత్తపు సంజీవ్ రెండు సంవత్సరాల్లో ఆరు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాడు. తుంగూర్‌కు చెందిన బెత్తపు మల్లయ్య–లక్ష్మికి ఇద్దరు సంతానం. రెండో కుమారుడు సంజీవ్. మల్లయ్య, లక్ష్మి వ్యవసాయ పనుల్లో కూలికి వెళ్తుంటారు. బీటెక్ పూర్తి చేసిన సంజీవ్ రెండు సంవత్సరాల నుంచి ప్రభుత్వం వివిధ విభాగాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో అర్హత సాధిస్తూ ఏకంగా ఇప్పటివరకు ఆరు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాడు. వరుసగా రైల్వే గ్రూప్–డీ, ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్, టీఎస్‌పీఎస్సీ గ్రూపు 4లో పోలీస్, టీపీబీవో, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ), అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) పోస్టును సాధించాడు. ఏఈఈగా ఏ డిపార్ట్‌మెంటుకు కేటాయిస్తారో తెలియదని, ఏఈ పోస్టులో జాయినవుతానని స్పష్టం చేశాడు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

జగిత్యాల: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి రానున్న పోటీ పరీక్షల్లో విజయం సాధించి కళాశాల పేరు నిలబెట్టాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ అన్నారు. సోమవారం మహిళ డిగ్రీ కళాశాలలో వీడ్కోలు సమావేశం జరిగింది. పీఎం ఉషా పథకం కింద రూ.5 కోట్లు మంజూరయ్యాయని, అతిపెద్ద కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులున్నారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుల్తానా, కో–ఆర్డినేటర్ జ్యోతిలక్ష్మి, శంకరయ్య, చంద్రయ్య, కిరణ్మయి, శ్రీనివాస్‌రెడ్డి, పడాల తిరుపతి, స్వరూపరాణి, రజినీ పాల్గొన్నారు.

క్షయ నివారణకు కృషి చేయాలి

మల్లాపూర్: క్షయ వ్యాధి నివారణకు ప్రజలందరూ కృషి చేయాలని టీబీ సూపర్‌వైజర్ ఆంజనేయులు అన్నారు. సోమవారం ముత్యంపేట సబ్ సెంటర్‌లో నిర్వహించిన క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరంలో మండల వైద్యాధికారి డాక్టర్ వాహినితో కలిసి పాల్గొన్నారు. గ్రామంలోని అనుమానిత లక్షణాలున్న 30 మంది వ్యక్తుల నుంచి తెమడను సేకరించి కోరుట్ల పరీక్ష కేంద్రానికి పంపించినట్లు తెలిపారు. సీహెచ్‌వో రామ్మోహన్, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఎస్టీఎల్ఎస్ రియాజ్, ల్యాబ్ టెక్నీషియన్ ఉమాదేవి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీరయ్య మృతి బీజేపీకి తీరని లోటు

- మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లిరూరల్: మేడిపల్లి మాజీ సర్పంచ్ ముగ్గు వీరయ్య మృతి బీజేపీకి తీరని లోటని మహారాష్ట్ర మాజీ గవర్నర్, బీజేపీ నేత చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. ఇటీవల వీరయ్య మృతిచెందగా.. వారి కుటుంబ సభ్యులను సోమవారం విద్యాసాగర్‌రావు పరామర్శించారు. వీరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో మాట్లాడారు. బీజేపీ బలోపేతానికి, మేడిపల్లి గ్రామ అభివృద్ధికి వీరయ్య ఎంతో శ్రమించాడన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు శ్రీనివాస్, ముత్తయ్య, శ్రీనివాస్, రాజారెడ్డి, గంగాధర్, విఠల్, కృష్ణమాచారి, సత్యం, చిన్నారెడ్డి, రమేశ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు, కూలీల సంక్షేమం బీజేపీతోనే సాధ్యం



ఉపాధిహామీ కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న గోపాల్‌రెడ్డి, నాయకులు

కథలాపూర్: రైతులు, కూలీల సంక్షేమం బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తక్కళ్లపెల్లిలో ఉపాధిహామీ పనుల వద్ద కూలీలను ఓట్లు అభ్యర్థించారు. నాయకులు జిల్లా సత్యం, లింగారెడ్డి, గంగారెడ్డి, నవీన్, ప్రకాశ్, లింగేశ్వర్, మోహన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల: కాంగ్రెస్ అంటేనే మోసమని, తప్పుడు ప్రచారాలతో గద్దెనెక్కాలని చూస్తున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధులు భూమి రమణ, మర్రిపల్లి సత్యం అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. 60 ఏళ్ల కాంగ్రెస్ అధికారంలో ఉండి దేశంలోని మారుమూల గ్రామాలకు కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, జున్ను రాజేందర్ పాల్గొన్నారు.

మాదిగల ఓట్లు బీజేపీకే..

జగిత్యాలటౌన్: మాదిగల ఓట్లు బీజేపీకేనని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం తెలిపారు. జిల్లాకేంద్రంలో గంగారాం మాట్లాడుతూ మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించిన బీజేపీపై కాంగ్రెస్ ప్రచారంచేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. మాదిగలు, మాదిగల ఉపకులాల ఓట్లు బీజేపీకే వేస్తామన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో కవిత ఓటమికి కారణమైన జీవన్‌రెడ్డికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు బీజేపీకి ఓటు వేసి బిడ్డ అరవింద్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు నురుగు శ్రీను, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రచారం



మల్యాల: ప్రచారం చేస్తున్న నాయకులు

మల్యాల: తాటిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, చిన్న దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: ఉపాధిహామీ పనులు చేసే కూలీలకు చల్ల పాకెట్లు పంపిణీ చేసి కొప్పుల ఈశ్వర్‌కు ఓటేయాలని బీఆర్ఎస్ మహిళా నాయకురాలు మోకెనపెల్లి రాజమ్మ కోరారు. తిమ్మాపూర్‌లోని గండి హన్మండ్ల దేవాలయం వద్ద సోమవారం సుమారు 400 మంది ఉపాధిహామీ పనులు చేస్తున్నారు. బీఆర్ఎస్ తరఫున ఆమె ప్రచారం నిర్వహించారు.

బీఆర్ఎస్ ఎంపీలు ఉంటేనే న్యాయం

కథలాపూర్: పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు అధికసంఖ్యలో ఉంటేనే రాష్ట్రానికి నిధుల విషయంలో న్యాయం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి అన్నారు. మండలంలోని గంభీర్‌పూర్‌లో ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎంపీపీ జవ్వాజి రేవతి, నాయకులు పోతు శేఖర్, శీలం మోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, కల్లెడ శంకర్, బాల్క సంజీవ్, కాల్వ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు పథకాలందించిన ఘనత కాంగ్రెస్‌దే



అల్లీపూర్‌లో ప్రచారం చేస్తున్న జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

రాయికల్(జగిత్యాలరూరల్): తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలకు సంక్షేమ పథకాలందించిన ఘనత కాంగ్రెస్‌దేనని జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. సోమవారం అల్లీపూర్, అయోధ్య గ్రామాల్లో కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా ఉపాధిహామీ కూలీలను కలిసి ప్రచారం నిర్వహించారు.

మెట్‌పల్లిరూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డికి మద్దతిస్తున్నట్లు జగ్గాసాగర్ ముదిరాజ్ సంఘ సభ్యులు ప్రకటించారు. జగ్గాసాగర్‌లో సోమవారం ముదిరాజ్ కులస్తులతో కాంగ్రెస్ నాయకులు సమావేశం నిర్వహించారు. కొండ్రికర్ల మాజీ సర్పంచ్ రాజగంగు, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు, రాష్ట్ర నాయకుడు కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలో చేరుతున్న నాయకులు

రాయికల్(జగిత్యాలరూరల్): అభివృద్ధిని చూసి పలువురు కాంగ్రెస్‌లో చేరుతున్నారని నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్‌కు చెందిన మాజీ వైస్ ఎంపీపీ ఆడెపు లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నాయకులు బైరి రాజేందర్, ముక్కెర శ్రీనివాస్, ప్రసాద్, ఏల్లేశ్, నారాయణ, సుంకె వంశీ, ఆకు రాజేందర్, అతిక్, మచ్చ రాజేశం, మోర నరేశ్ కాంగ్రెస్‌లో చేరగా వారిని జీవన్‌రెడ్డి ఆహ్వానించారు. కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, దివాకర్ రెడ్డి, బాపురపు నరసయ్య, కటకం రాజేశం, రాకేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు దరావత్ ప్రకాశ్, బీఎస్పీ మండల యూత్ అధ్యక్షుడు విఠల్‌నాయక్, మదన్‌నాయక్, సంతోష్ నాయక్ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. శర్మన్‌నాయక్, రాంసింగ్, పర్శరాం, రాంరెడ్డినాయక్ కాంగ్రెస్‌లో చేరగా.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

బాజిరెడ్డికి భారీ మెజార్టీ ఇవ్వాలి



మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

కోరుట్లరూరల్: నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు కోరుట్ల నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ ఇచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. యూసుఫ్‌నగర్, అయిలాపూర్, కల్లూర్ గ్రామాల్లో సోమవారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎంపీపీ నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, సీనియర్ నాయకుడు వెంకట్రావు, నాయకులు సత్యనారాయణగౌడ్, సందయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కోరుట్ల: పట్టణానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ కళ్యాణి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. ఆమె అంతిమ సంస్కారాల కోసం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రేమలత ఆధ్వర్యంలో రూ.20వేలు ఆర్థిక సాయమందించారు.